# ఇండియన్ పాలిటీ

## ఆదేశిక సూత్రాలు

**ప్రవేశిక, ప్రాథమిక హక్కులు, ఆదేశిక సూత్రాలు ఈ మూడింటిని వేర్వేరుగా పరిగణించకూడదు. ఇవి పరస్పర విరుద్ధాలు కావు. ఈ మూడు కలిసి రాజ్యాంగానికి సమగ్రత కల్పిస్తున్నాయి. వీటి అంతస్సూత్రం, తాత్విక పునాది ఒక్కటే - వ్యక్తి స్వేచ్ఛకు, సామాజిక సంక్షేమానికీ మధ్య సమతౌల్యం సాధించడం. వ్యక్తి స్వేచ్ఛకు ప్రాథమిక హక్కులు ఆలంబనగా ఉంటే సామాజిక సంక్షేమానికి ఆదేశిక సూత్రాలు దిక్సూచిలా పనిచేస్తున్నాయి. ఈ రెండింటికీ పునాది ప్రవేశిక.**

**45వ అధికరణం:** ఆరు సంవత్సరాల్లోపు బాల బాలికలందరికీ సంరక్షణ, ఉచిత విద్యా సదుపాయాలను రాజ్యం కల్పించాలి.

★ ఈ అంశాన్ని 86వ రాజ్యాంగ సవరణ ద్వారా చేర్చారు.

★ 86వ రాజ్యాంగ సవరణకు ముందు 45వ అధికరణంలో 6 నుంచి 14 సంవత్సరాల వయసున్న బాలబాలికలకు ఉచిత నిర్బంధ ప్రాథమిక విద్యను అందించాలని పేర్కొన్నారు. అదికూడా రాజ్యాంగం అమల్లోకి వచ్చిన పది సంవత్సరాల్లోపు అందించాలని రాజ్యానికి సూచించింది.

★ ఈ ఆశయ సాధన కోసం 2002లో 86వ రాజ్యాంగ సవరణ ద్వారా 45వ అధికరణంలో పేర్కొన్న అంశాన్ని ప్రాథమిక హక్కుల జాబితాలో 21(A) అనే కొత్త అధికరణంలో చేర్చారు. ఆ రకంగా 45వ అధికరణంలో పేర్కొన్న ఆశయానికి రాజ్యాంగబద్ధత కల్పించారు. అలా ఒకనాటి ఆదేశిక సూత్రాన్నే నేడు ప్రాథమిక హక్కుగా పరిగణిస్తున్నారు.

### 46వ అధికరణం

షెడ్యూల్డ్ కులాలు, తెగలు, వెనుకబడిన వర్గాలకు విద్యను అందించడంలో, వారు సామాజికాభివృద్ధి సాధించడంలో రాజ్యం శ్రద్ధ చూపాలి. సాంఘిక అన్యాయాలు, ఇతర దోపిడీల నుంచి ఈ వర్గాలను రక్షించాలి.

★ ఇది గాంధీజీ ఆశయం కూడా. మహాత్మాగాంధీ నిమ్నవర్గాల అభ్యున్నతిని కాంక్షించారు. సామ్యవాదం కూడా సాంఘిక సమానత్వాన్ని ఆకాంక్షిస్తూ దోపిడీని నిరోధించాలని ఉద్బోధిస్తుంది.

★ గిరిజనులు తమ భూమిని ఇతరులకు బదిలీ చేయకూడదంటూ మహారాష్ట్ర ప్రభుత్వం చేసిన చట్టాన్ని సుప్రీంకోర్టు లింగప్ప Vs మహారాష్ట్ర (1985) కేసులో సమర్థించింది.

★ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 1/70 చట్టాన్ని ఇదే స్ఫూర్తితో రూపొందించింది.

★ 2011లో 97వ రాజ్యాంగ సవరణ జరిగింది. దీని ద్వారా సహకార సంఘాలను స్వచ్ఛందంగా ఏర్పాటు చేయడానికి, వాటిని స్వయం ప్రతిపత్తితో పని చేయించడానికి, ప్రజాస్వామ్య నియంత్రణ, వృత్తిపరమైన నిర్వహణను పెంపొందించడానికి రాజ్యం కృషి చేయాలని పేర్కొంటూ 46 B అధికరణాన్ని జోడించారు.

### 47వ అధికరణం

ప్రజల జీవన ప్రమాణం పెంచడం, ప్రజారోగ్య సంరక్షణా చర్యలు చేపట్టడం ప్రభుత్వం విధి. ఇందుకోసం మత్తుపానీయాలను, మాదక ద్రవ్యాలను నిషేధించాలి.

★ స్వాతంత్ర్య సంగ్రామంలో భాగంగా ఆనాటి భారత జాతీయ కాంగ్రెస్ గాంధీజీ నేతృత్వంలో ప్రజలు మత్తుపానీయాల బారిన పడకూడదని వాడవాడలా ప్రచారం చేసింది. 'సత్యాగ్రహి' పాటించాల్సిన నియమాల్లో మత్తుపానీయాలను సేవించకుండా ఉండటం ఒకటని గాంధీజీ పేర్కొన్నారు. గాంధీజీ ఆశయాన్ని మనం 47వ అధికరణంలో గమనించవచ్చు.

★ రాష్ట్రాలకు చేకూరే ఆదాయ వనరుల్లో మద్యంపై విధించే పన్ను చాలా కీలకం. కాబట్టి చాలా రాష్ట్రాలు ఈ ఆదేశిక సూత్రాన్ని అమలుపరిచే స్థితిలో లేవు.

★ ఇటీవల ప్రతిపాదించిన గూడ్స్ అండ్ సర్వీసెస్ టాక్స్ (GST) రాజ్యాంగ సవరణ బిల్లు ప్రకారం కేంద్రానికి వస్తువులపై పన్నులు విధించి, వసూలు చేసుకునే అధికారం లభిస్తుంది. కానీ ఈ GST బిల్లులో కూడా మద్యానికి మినహాయింపు ఇచ్చారు. మద్యంపై పన్ను వసూలు హక్కు రాష్ట్రాలకే ఉంటుంది. లేదంటే చాలా రాష్ట్రాలు ఆర్థికంగా సంకటస్థితిని ఎదుర్కోవాల్సి వస్తుంది.

★ ప్రస్తుతం గుజరాత్, నాగాలాండ్ రాష్ట్రాల్లో సంపూర్ణ మద్యనిషేధం అమలవుతోంది. కేరళ దశల వారీగా మద్యనిషేధాన్ని అమలుపరిచే ప్రయత్నం చేస్తోంది. ఈ ఏడాది ఏప్రిల్ 1 నుంచి బిహార్‌లో సంపూర్ణ మద్యనిషేధాన్ని అమలు చేస్తున్నారు. 1994లో ఆంధ్రప్రదేశ్‌లో ఎన్.టి.రామారావు ప్రభుత్వం సంపూర్ణ మద్యనిషేధాన్ని అమలుచేసింది.

★ ప్రజారోగ్యానికి సంబంధించిన ఇతర విషయాల్లో స్వాతంత్ర్యానంతరం అనేక కార్యక్రమాలు చేపట్టారు. పోలియో నిర్మూలన సాధ్యమైంది. కుష్టు, క్షయ వ్యాధుల నియంత్రణకు ప్రభుత్వాలు తీసుకుంటున్న చర్యలు సత్ఫలితాలను ఇస్తున్నాయి. ఎయిడ్స్ వ్యాప్తి నియంత్రణకు, క్యాన్సర్, ఫైలేరియా వ్యాధుల నియంత్రణకు ప్రభుత్వాలు పలు చర్యలు తీసుకుంటున్నాయి.

## 48వ అధికరణం

వ్యవసాయం, పశుపోషణను శాస్త్రీయ పద్ధతిలో అభివృద్ధి చేయడం, పాడి పశువులు, గోవులు, ఇతర పెంపుడు జంతువుల వధను నిషేధించడం.

★ ఈ అధికరణాన్ని అహింసను ప్రోత్సహించిన గాంధీజీ ఆశయంగా భావించవచ్చు.

★ హరిత విప్లవం ద్వారా వ్యవసాయంలో ఒక నూతన అధ్యాయం మొదలైంది. అధునాతన వంగడాలు, ఎరువుల వల్ల ఆహారధాన్యాల దిగుబడులు పెరిగాయి.

★ ప్రస్తుతం 29 రాష్ట్రాల్లో 24 రాష్ట్రాలు వివిధ స్థాయిల్లో గోవధను నిషేధించాయి. 2014 తర్వాత గోవధ నిషేధాన్ని అమలు పరుస్తున్న రాష్ట్రాల సంఖ్య బాగా పెరిగింది. అయితే సున్నితమైన రాజకీయ అంశాలు ముడిపడి ఉండటంతో ఈ చట్టాలు వివాదాస్పదం అవుతున్నాయి.

★ 42వ రాజ్యాంగ సవరణ ద్వారా 48 A అధికరణాన్ని జోడించారు. దీని ప్రకారం పరిసరాలను రక్షించడం, అభివృద్ధి చేయడం, అడవులు, వన్యప్రాణులను పరిరక్షించడం రాజ్య విధి.

★ దీనికోసం పార్లమెంట్ వన్యప్రాణుల సంరక్షక చట్టం (1992), అటవీ సంరక్షణ చట్టం (1980) రూపొందించింది. అలాగే జీవ వైవిధ్యానికి సంబంధించిన రియో డిక్లరేషన్‌ను పార్లమెంట్ గుర్తించింది.

★ 48 Aలో పేర్కొన్న అంశాలను (21వ అధికరణాన్ని అనుసరించి) అమలుచేయాల్సిందిగా సుప్రీంకోర్టు సతీష్ Vs ఉత్తర్ ప్రదేశ్ రాష్ట్రం కేసులో తీర్పు ఇచ్చింది. ఇదే అంశాన్ని ఎం.సి.మెహతా Vs యూనియన్ ఆఫ్ ఇండియా కేసులో కూడా పునరుద్ఘాటించింది.

## 49వ అధికరణం

జాతీయ ప్రాముఖ్యం ఉన్న కళాత్మక, చారిత్రక చిహ్నాలను, స్థలాలను, వస్తువులను రక్షించే బాధ్యత రాజ్యానికి ఉంది.

★ చారిత్రక వస్తు సంపదను ధ్వంసం చేయకుండా కాపాడుకుంటూ రావడం ఉదారవాద సాంప్రదాయంగా పేర్కొనవచ్చు.

★ 1951లో పార్లమెంట్ 'ది ఏన్షియంట్ అండ్ హిస్టారికల్ మాన్యుమెంట్స్ అండ్ ఆర్కియలాజికల్ సైట్స్ అండ్ రిమైన్స్ యాక్ట్'ను (The ancient and historical monuments and Archeological sites and Remains Act) రూపొందించింది.

## 50వ అధికరణం

కార్యనిర్వాహక శాఖ నుంచి న్యాయశాఖను వేరుచేసేందుకు ప్రభుత్వం కృషి చేయాలి.

★ ఇది ఆధునిక ఉదారవాద ప్రజాస్వామ్య రాజ్యం ముఖ్య లక్షణం.

★ స్వతంత్ర్య న్యాయ వ్యవస్థ లేనట్లయితే కార్యనిర్వాహక వర్గం నియంతృత్వంగా వ్యవహరిస్తుంది. కాబట్టి రాజ్యాంగ సూత్రాల అర్థవివరణ కోసం, కార్యనిర్వాహక వర్గం, పార్లమెంట్ రాజ్యాంగ స్ఫూర్తిని కాలరాయకుండా ఉండటానికి ఒక నిష్పాక్షికమైన న్యాయవ్యవస్థ అవసరం.

★ న్యాయమూర్తుల ఎంపికకు సంబంధించి పార్లమెంట్ 99వ రాజ్యాంగ సవరణ ద్వారా 124 A అధికరణాన్ని జోడిస్తూ National Judical Appointment Commission ను ఏర్పాటు చేసింది.

★ కానీ సుప్రీంకోర్టు తన న్యాయ సమీక్షాధికారాన్ని వినియోగిస్తూ 99వ రాజ్యాంగ సవరణ చెల్లదని ఇటీవల తీర్పునిచ్చింది. కాబట్టి మునుపటి కొలీజియం వ్యవస్థే (రాష్ట్రపతి సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి, ఇతర న్యాయమూర్తులను సంప్రదించి న్యాయమూర్తుల నియామకాలను చేపట్టే ప్రక్రియ) ప్రస్తుతం కొనసాగుతోంది.

## 51వ అధికరణం

అంతర్జాతీయ శాంతి భద్రతలను పెంపొందించడానికి, ఇతర దేశాలతో సత్సంబంధాలను కొనసాగించడానికి రాజ్యం కృషి చేయాలి. అంతర్జాతీయ న్యాయ సూత్రాలు, ఒప్పందాల పట్ల గౌరవాన్ని కలిగి ఉండాలని, అంతర్జాతీయ వివాదాలను మధ్యవర్తిత్వం ద్వారా పరిష్కరించుకునేందుకు ప్రయత్నించాలని ఈ అధికరణం తెలుపుతోంది.

★ భారతదేశం సహజంగానే శాంతికాముక దేశం. స్వాతంత్ర్యానంతరం అలీన విధానానికి కట్టుబడి ప్రపంచ శాంతికి కృషి చేసింది.

★ ఐక్యరాజ్య సమితి ఆమోదించిన అనేక తీర్మానాలకు భారత పార్లమెంట్ తన ఆమోదముద్రను తెలిపి వివిధ చట్టాల సాయంతో వాటిని అమలుచేస్తోంది.

## మాదిరి ప్రశ్నలు

**1.** 6 నుంచి 14 సంవత్సరాల్లోపు పిల్లలందరికీ ఉచిత నిర్బంధ విద్య అందించాలని చెబుతోన్న అధికరణం ఏది?

ఎ) 45 బి) 21 (A) సి) 46 డి) 47

**2.** ప్రజారోగ్యం దృష్ట్యా మాదకద్రవ్యాలను, మత్తు పదార్థాలను ప్రభుత్వం నిషేధించాలని చెబుతోన్న అధికరణం ఏది?

ఎ) 46 బి) 47 సి) 48 డి) 49

**3.** ఇటీవల మద్యపాన నిషేధం విధించిన రాష్ట్రం ఏది?

ఎ) ఉత్తర్ ప్రదేశ్ బి) సిక్కిం సి) బిహార్ డి) మహారాష్ట్ర

**4.** అటవీ సంరక్షణ చట్టం ఏ సంవత్సరంలో చేశారు?

ఎ) 1967 బి) 1954 సి) 1970 డి) 1980

**5.** National Judicial Appointment Commission ను ఏ రాజ్యాంగ సవరణ ద్వారా ఏర్పాటు చేశారు?

ఎ) 96 బి) 97 సి) 99 డి) 98

**6.** హిందీ భాషాభివృద్ధి కోసం కేంద్రం పాటుపడాలని చెబుతోన్న అధికరణం ఏది?

ఎ) 350 బి) 351 సి) 352 డి) 353

**7.** The Ancient and Historical Monuments and Archeological Sites and Remains Act ఎప్పుడు చేశారు?

ఎ) 1950 బి) 1951 సి) 1952 డి) 1953

**8.** భారతదేశం అంతర్జాతీయ శాంతికి కృషి చేయాలని సూచిస్తున్న అధికరణం ఏది?

ఎ) 51 బి) 50 సి) 49 డి) 48

**9.** భాషాపరంగా మైనారిటీ వర్గాల పిల్లలకు వారి మాతృభాషలో బోధన చేపట్టే విధంగా చర్యలు తీసుకోవాలని రాష్ట్రాలకు సూచిస్తున్న అధికరణం ఏది?

ఎ) 350 (A) బి) 335 సి) 340 డి) 345(A)

**10.** కార్యనిర్వాహక వర్గం నుంచి న్యాయశాఖను వేరు చేస్తున్న అధికరణం?

ఎ) 48 బి) 50 సి) 52 డి) 54

## జవాబులు

1-బి; 2-బి; 3-సి; 4-డి; 5-సి; 6-బి; 7-బి; 8-ఎ; 9-ఎ; 10-బి.

**రచయిత: జి. కల్యాణ చక్రవర్తి**

# ఇండియన్ పాలిటీ

## ఆదేశిక సూత్రాలు

**సాధారణంగా ప్రాథమిక హక్కులకు, ఆదేశిక సూత్రాలకు మధ్య విభేదం ఏర్పడితే ప్రాథమిక హక్కులకు ప్రాధాన్యం ఇవ్వాలని 37వ అధికరణం పేర్కొంటోంది. ఆదేశిక సూత్రాలకు న్యాయ సంరక్షణ ఉండదని కూడా ఈ అధికరణం ద్వారా స్పష్టం అవుతుంది. చంపకం దొరై రాజన్ కేసులో, కేరళ విద్యా బిల్లు కేసులో సుప్రీంకోర్టు కూడా ఇదే విషయాన్ని ధ్రువపరిచింది.**

కాలానుగుణంగా ప్రభుత్వ పరిధి పెరగడంతో 1970వ దశకంలో ప్రజా సంక్షేమ చట్టాల అమలుకు కొన్ని ప్రాథమిక హక్కులు ఆటంకంగా మారాయి. దీంతో పార్లమెంట్ రాజ్యాంగ సవరణలు చేసింది. దీనికి న్యాయవ్యవస్థ విముఖత చూపింది.

★ 1970 నుంచి ఆదేశిక సూత్రాల స్వభావాన్ని, దాన్ని అర్థం చేసుకునే విధానంలో ఇటు కార్యనిర్వాహక వర్గం, అటు న్యాయవ్యవస్థల దృక్పథాల్లో చాలా మార్పులు వచ్చాయి. ఆ పరిస్థితుల్లో ప్రభుత్వానికి, న్యాయస్థానాలకు ఆదేశిక సూత్రాల అమలు విషయమై ఘర్షణ వాతావరణం నెలకొని ఉండేది.

★ 1970వ దశకంలో అప్పటి ఇందిరాగాంధీ ప్రభుత్వం సామ్యవాద విధానాల అమలు పట్ల మొగ్గు చూపించింది. 1971లో పాకిస్థాన్‌తో యుద్ధం జరిగినప్పుడు అప్పటి సామ్యవాద USSR ఇచ్చిన మద్దతు వల్ల, కాంగ్రెస్‌లో వచ్చిన అంతర్గత చీలిక వల్ల ఇందిరాగాంధీ సామ్యవాదం వైపు మొగ్గు చూపినట్లు అర్థమవుతుంది. 1971లో చేసిన 25వ రాజ్యాంగ సవరణ ద్వారా 31 c అనే అధికరణాన్ని జోడించారు. ఈ అధికరణం ఆదేశిక సూత్రాల్లోని 39 (b) (సామాజిక శ్రేయస్సును దృష్టిలో ఉంచుకుని అందుబాటులో ఉన్న సహజ వనరులపై రాజ్యానికి యాజమాన్య నియంత్రణ ఉండాలి. సమాజంలో అందరికీ వాటిని సమానంగా పంపిణీ చేయాలి), 39(c) (ఉత్పత్తి పరికరాలు, సంపద కేవలం కొద్దిమంది చేతుల్లో కేంద్రీకృతం కాకుండా ఆర్థిక విధాన రూపకల్పన) అమలుకు ప్రాథమిక హక్కుల్లోని 14, 19, 31వ అధికరణాలు అడ్డు తగిలితే వాటిని న్యాయసమీక్ష నుంచి మినహాయించాలని పేర్కొంటోంది.

★ అయితే ఇది అంతకు ముందు గోలక్ నాథ్ కేసులో (1967) సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును అతిక్రమిస్తూ చేసిన రాజ్యాంగ సవరణగా మనకు కనిపిస్తుంది. గోలక్‌నాథ్ కేసులో ప్రాథమిక హక్కులను సవరించే అధికారం పార్లమెంట్‌కు లేదని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. కాబట్టి 25వ రాజ్యాంగ సవరణ ద్వారా కార్యనిర్వాహక వర్గానికి, న్యాయస్థానానికి మధ్య ఒక రకమైన సంకట పరిస్థితి నెలకొంది. అయితే సుప్రీం కోర్టు కేశవానంద భారతి కేసు (1973)లో తీర్పు సందర్భంగా - రాజ్యాంగంలో ఏ భాగాన్నైనా సవరించే అధికారం పార్లమెంట్‌కు ఉంటుందని అయితే రాజ్యాంగానికి 'ఒక మౌలిక స్వభావం' ఉందని, దాన్ని దెబ్బతీసే ఎలాంటి రాజ్యాంగ సవరణ చెల్లదని పేర్కొంది. పైన పేర్కొన్న మౌలిక స్వభావంలో న్యాయ సమీక్ష కూడా ఒక లక్షణమని కోర్టు స్పష్టం చేసింది. క్లుప్తంగా చెప్పాలంటే కేశవానంద భారతి కేసులో సుప్రీం కోర్టు ఉద్దేశం - 25వ రాజ్యాంగ సవరణ (39 (b), (c) లలోని సామ్యవాద ఆదర్శాలను చట్టం ద్వారా అమలు చేయడానికి ప్రాథమిక హక్కుల్లోని 14, 19, 31 అధికరణాలు అడ్డుపడినా ప్రభుత్వం అమలు చేసుకోవచ్చు) హేతుబద్ధమైందే, కానీ పై విషయంలో కోర్టులకు న్యాయ సమీక్షాధికారం ఉంటుంది.

★ కేశవానంద భారతి కేసులో పేర్కొన్న అంశాలను పక్కనబెట్టిన ఇందిరాగాంధీ ప్రభుత్వం 1976లో 42వ రాజ్యాంగ సవరణ తీసుకొచ్చింది. ఈ సవరణ ప్రకారం కేవలం 39(b), (c) కాకుండా ఏ ఆదేశిక సూత్రాల అమలు కోసమైనా చట్టాలు చేసినప్పుడు అవి ప్రాథమిక హక్కుల్లోని 14, 19 అధికరణాలకు విరుద్ధంగా ఉన్నా అవి ఆమోదయోగ్యమైనవే.

★ అయితే మినర్వా మిల్స్ కేసులో సుప్రీం కోర్టు 42వ రాజ్యాంగ సవరణలో ఆదేశిక సూత్రాలకు ఇచ్చిన ఆధిపత్యాన్ని కొట్టివేసింది.

★ ఫలితంగా 39 (b), (c) అధికరణాల అమలు కోసం (ఒకవేళ అవి ప్రాథమిక హక్కుల్లోని 14, 19 అధికరణాలతో సంఘర్షించినా) చట్టాలను రూపొందించుకోవచ్చని సుప్రీం కోర్టు పేర్కొంది. అయితే వీటిపై న్యాయస్థానాలకు న్యాయసమీక్షాధికారం ఉంటుంది.

★ 1980వ దశకంలో, ఆ తర్వాత ఆదేశిక సూత్రాల స్వభావం పట్ల న్యాయస్థానాల దృక్పథంలో గణనీయమైన మార్పు కనిపిస్తూ వస్తోంది. న్యాయస్థానాలు ఇప్పుడు వ్యక్తి హక్కులకు (ప్రాథమిక హక్కులు) ఎంత ప్రాధాన్యం ఇస్తున్నాయో సామాజిక హక్కులకు (ఆదేశిక సూత్రాలు) కూడా అంతే ప్రాముఖ్యం ఇస్తున్నాయి. ఆదేశిక సూత్రాలను అమలు చేయమని న్యాయస్థానాలు, ప్రభుత్వాలకు పదేపదే చెబుతున్నాయి. ఉదాహరణకు ఉమ్మడి పౌరస్మృతి (44వ అధికరణం), మద్యపాన నిషేధం (47వ అధికరణం) అమలు చేయమని న్యాయస్థానాలు వివిధ సందర్భాల్లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు సూచించాయి.



R-24-8-16

★ 39వ అధికరణానికి అదనంగా 'A' భాగాన్ని 42వ రాజ్యాంగ సవరణ ద్వారా చేర్చారు. దీని ప్రకారం న్యాయవ్యవస్థ పేదవర్గాల ప్రయోజనాలను కాపాడి, సామాజిక న్యాయాన్ని సమకూర్చేలా వారికి ఉచిత న్యాయ సహాయాన్ని అందించాలి.

### 40వ అధికరణం

ఈ అధికరణం ప్రకారం గ్రామ పంచాయతీ వ్యవస్థలను నెలకొల్పి స్వపరిపాలనా విధానంలో గ్రామీణాభివృద్ధికి కృషి చేయాలి. ఇది మహాత్మాగాంధీ ఆశయం. ప్రతి గ్రామం ఒక చిన్న గణతంత్రంగా (Little Republic) ఎదగాలని ఆయన భావించేవారు. స్వరాజ్యం గ్రామ స్వరాజ్యంగా మారితేనే దేశం బాగుంటుందనేది ఆయన అభిప్రాయం. అందుకే ఆయన అభీష్టాన్ని ఆదేశిక సూత్రాల్లో జోడించారు. 73వ రాజ్యాంగ సవరణ ద్వారా పంచాయతీరాజ్ వ్యవస్థకు రాజ్యాంగబద్ధత కల్పించారు. తద్వారా మూడంచెల పంచాయతీరాజ్ వ్యవస్థను నెలకొల్పి, గ్రామ పంచాయతీలకు, మండలాలకు, జిల్లా యంత్రాంగానికి అనేక విధులను కేటాయించారు.

### 41వ అధికరణం

నిరుద్యోగం, వృద్ధాప్యం, అనారోగ్యం, అంగవైకల్యం లాంటి అశక్తతతో బాధపడేవారికి తగిన ఉద్యోగ, విద్యా సదుపాయాలను కల్పించేందుకు తమ ఆర్థిక పరిస్థితికి లోబడి ప్రభుత్వాలు కృషి చేయాలి.

★ ప్రస్తుతం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వృద్ధులు, వితంతువులు, వికలాంగులకు మంజూరు చేస్తున్న పింఛన్లు, విద్యార్థులకు అందిస్తున్న ఉపకారవేతనాలు ఈ కోవకే చెందుతాయి.

### 42వ అధికరణం

రాజ్యం కార్మికులకు న్యాయమైన పని పరిస్థితులను కల్పించడం (Human conditions of work), స్త్రీలకు ప్రసూతి సౌకర్యం కల్పించడం.

★ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మిక సంక్షేమం కోసం అనేక చట్టాలను చేపట్టాయి.

★ గర్భిణులకు ఉచిత వైద్యపరీక్షలు, అంగన్‌వాడీ కేంద్రాల ఏర్పాటు ఈ కోవకు చెందినవే.

★ 1961లో ప్రసూతి రక్షణ చట్టాన్ని రూపొందించారు.

### 43వ అధికరణం

వ్యవసాయ, పారిశ్రామిక, ఇతర రంగాల్లో పనిచేసే కార్మికులకు హేతుబద్ధమైన, గౌరవప్రదమైన జీవనానికి అవసరమైన వేతనాలు చెల్లింపునకు సంబంధించి అవసరమైన శాసనాలను రూపొందించేందుకు ప్రభుత్వాలు కృషి చేయాలి. వారికి తగినంత విరామ సమయం, సాంఘిక, సాంస్కృతిక అవకాశాలను కల్పించాలి. ప్రత్యేకించి గ్రామీణ ప్రాంతాల్లో సహకార సంఘ ప్రాతిపదికపై లేదా వ్యక్తి ప్రాతిపదికపై కుటీర పరిశ్రమల సంఖ్యను అభివృద్ధి చేయడానికి ప్రభుత్వాలు కృషి చేయాలి.

★ కార్మికుల కోసం కనీస వేతన చట్టాన్ని (1948) రూపొందించారు.

★ గ్రామీణ అభివృద్ధి కోసం సమాజ వికాస పథకాన్ని (1952) ప్రవేశపెట్టారు.

★ కుటీర పరిశ్రమలు రాష్ట్ర జాబితాకు చెందినప్పటికీ కుటీర పరిశ్రమలను ప్రోత్సహించడానికి ఖాదీ, గ్రామీణ పరిశ్రమల బోర్డు, చేనేత మగ్గాల బోర్డు, కాయిర్ బోర్డును ఏర్పాటు చేశారు.

★ 42వ రాజ్యాంగ సవరణ ద్వారా '43 (A)' ను రాజ్యాంగంలో చేర్చారు. దీని ప్రకారం పరిశ్రమల నిర్వహణలో కార్మికులను భాగస్వాములను చేసే చట్టాలను రూపొందించాలి.

### 44వ అధికరణం

★ భారతదేశంలో పౌరులందరికీ ఒకే విధమైన ఉమ్మడి పౌరస్మృతిని రూపొందించేందుకు ప్రభుత్వం కృషి చేయాలి.

★ ఆదేశిక సూత్రాల్లో అత్యంత సున్నితమైన, వివాదాస్పదమైన అంశమిది.

★ వివాహం, విడాకులు, ఆస్తి పంపకాల విషయంలో న్యాయస్థానాలు ప్రస్తుతం మన చట్టాలకు అనుగుణంగా వ్యవహరిస్తున్నాయి.

★ ఈ ఉమ్మడి పౌరస్మృతిని అమలు చేస్తే మన చట్టాల (Personal Law) స్థానంలో దేశంలో అందరికీ ఒకే చట్టం అమల్లోకి వస్తుంది.

★ మైనారిటీ (ముస్లిం, క్రిస్టియన్) మత పెద్దలు ఇందుకు సుముఖంగా లేరు.

★ రాజ్యాంగ నిర్మాణ సభ సమావేశాల్లో (Constituent Assembly debates) డా. బి. ఆర్. అంబేడ్కర్ ఉమ్మడి పౌరస్మృతికి అనుకూలంగా తమ వాదనలను వినిపించారు. తర్వాతి కాలంలో దేశ న్యాయశాఖ మంత్రిగా హిందూ కోడ్ బిల్లును రూపొందించారు. లోక్‌సభ, రాజ్యసభ ఆమోదించినా రాష్ట్రపతి డాక్టర్ బాబూ రాజేంద్రప్రసాద్ ఆమోదం తెలపకపోవడంతో అంబేడ్కర్ తన పదవికి రాజీనామా చేశారు.

★ ఎస్. ఆర్. బొమ్మై కేసులో (1994) సుప్రీం కోర్టు ఉమ్మడి పౌరస్మృతిని అమలుపరిచే దిశగా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని సూచించింది.

★ అంతకుముందు 1985లో షాబానో కేసులో సి. ఆర్. పి. సి. ప్రకారం విడాకులు పొందిన తన భర్త నుంచి భరణం (ధరావత్తు) పొందాలన్న షాబానో వాదనతో సుప్రీంకోర్టు ఏకీభవించింది. అయితే ఈ తీర్పును నీరుగారుస్తూ అప్పటి రాజీవ్‌గాంధీ ప్రభుత్వం పార్లమెంట్‌లో Muslim Women (Protection of Rights on Divorce) 1986 చట్టాన్ని తీసుకొచ్చింది.

★ శారదా ముద్గల్ కేసులో పెళ్లి కోసం మతం మార్చుకోవడాన్ని సుప్రీం కోర్టు తీవ్రంగా ఖండించింది.

★ ప్రస్తుత పరిస్థితి: మూడు సార్లు 'తలాక్' చెప్పడాన్ని వ్యతిరేకిస్తూ షయారా బానో పెట్టుకున్న అభ్యర్థన సుప్రీంకోర్టు ముందు పరిశీలనలో ఉంది.

## మాదిరి ప్రశ్నలు

**1.** ప్రాథమిక హక్కులను సవరించే అధికారం పార్లమెంట్‌కు లేదని సుప్రీంకోర్టు ఏ కేసులో తెలిపింది?

ఎ) గోలక్‌నాథ్ కేసు　　బి) కేశవానంద భారతి కేసు

సి) మేనకాగాంధీ కేసు　　డి) మినర్వా మిల్స్ కేసు

**2.** రాజ్యాంగ మౌలిక స్వభావం గురించి సుప్రీం కోర్టు ఏ కేసులో ప్రస్తావించింది?

ఎ) సజ్జన్ సింగ్ కేసు　　బి) కేశవానంద భారతి కేసు

సి) జబల్‌పూర్ కేసు　　డి) షాబానో కేసు

**3.** '31 C' ని ఏ రాజ్యాంగ సవరణ ద్వారా జోడించారు?

ఎ) 24　　బి) 26　　సి) 25　　డి) 27

**4.** స్త్రీలకు ప్రసూతి వైద్య సదుపాయాలు కల్పించాలని చెబుతోన్న అధికరణం ఏది?

ఎ) 42　　బి) 43　　సి) 44　　డి) 45

**5.** 73వ రాజ్యాంగ సవరణ దేనికి సంబంధించింది?

ఎ) నగరపాలక వ్యవస్థ　　బి) పంచాయతీరాజ్ వ్యవస్థ

సి) జాతీయ జ్యుడీషియల్ కమిషన్　　డి) భారత రాష్ట్రపతి అధికారాలు

**6.** ఆదేశిక సూత్రాల్లో పేర్కొన్న 40వ అధికరణ దేనికి ఉదాహరణగా చెప్పొచ్చు?

ఎ) సామ్యవాద నియమం　　బి) ఉదారవాద నియమం

సి) గాంధేయవాద నియమం　　డి) ఏదీకాదు

**7.** నిరుద్యోగులు, వృద్ధులు, అంగవైకల్యం ఉన్నవారిని ప్రభుత్వం ఆదుకోవడానికి ప్రయత్నించాలని ఏ అధికరణం చెబుతోంది?

ఎ) 40　　బి) 41　　సి) 42　　డి) 43

**8.** కార్మికుల కనీస వేతన చట్టాన్ని ఎప్పుడు రూపొందించారు?

ఎ) 1948　　బి) 1950　　సి) 1952　　డి) 1954

**9.** కుటీర పరిశ్రమలు ఏ జాబితాకు చెందినవి?

ఎ) కేంద్ర జాబితా బి) రాష్ట్ర జాబితా

సి) ఉమ్మడి జాబితా డి) ఏదీకాదు

**10.** ట్రిపుల్ తలాక్‌కు వ్యతిరేకంగా ప్రస్తుతం సుప్రీంకోర్టులో కేసు వేసిన మహిళ?

ఎ) షాబానో బి) శారదా ముద్గల్

సి) షయారా బానో డి) రాజ్యలక్ష్మి

**జవాబులు**

1-ఎ; 2-బి; 3-సి; 4-ఎ; 5-బి; 6-సి; 7-బి; 8-ఎ; 9-బి; 10-సి.

**రచయిత: జి. కళ్యాణ చక్రవర్తి**

www.eenadupratibha.net
www.eenadupratibha.net

# ఇండియన్ పాలిటీ

## రాజ్యవిధాన ఆదేశిక సూత్రాలు

**భారతదేశాన్ని సంక్షేమ / శ్రేయోరాజ్యం (Welfare state)గా రూపొందించే లక్ష్యంతో భారత రాజ్యాంగంలో ఆదేశిక సూత్రాలను చేర్చారు. భారత రాజ్యాంగంలో 4వ భాగంలో 36 నుంచి 51 వరకు ఉన్న ఆర్టికల్స్ ఆదేశిక సూత్రాల గురించి తెలియజేస్తాయి. వీటిని ఐర్లాండ్ రాజ్యాంగం నుంచి స్వీకరించారు.**

ఆదేశిక సూత్రాలు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు మార్గదర్శక సూత్రాలుగా ఉపయోగపడతాయి. కాబట్టి వీటిని 'నిర్దేశిక నియమాలు' లేదా 'రాజ్యవిధాన నిర్ణాయక సూత్రాలు'గా పిలుస్తారు.

★ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విధానాలను రూపొందించేటప్పుడు, ప్రణాళికలకు రూపకల్పన చేసేటప్పుడు ఆదేశిక సూత్రాలను దృష్టిలో ఉంచుకోవాలి. అంటే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆదేశిక సూత్రాల అమలుకు కృషి చేయాలి. అయితే ఆదేశిక సూత్రాలకు న్యాయ రక్షణ లేదు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వీటిని అమలు చేయలేదని న్యాయస్థానాలను ఆశ్రయించలేం. ఆర్థిక వనరుల లభ్యతను బట్టి ప్రభుత్వాలు వీటిని అమలు చేస్తాయి.

*ఆదేశిక సూత్రాలు ఒక బ్యాంకు, దాని సౌకర్యం ప్రకారం డబ్బు చెల్లించడానికి ఇచ్చే చెక్కులు* **– కె.టి.షా**

### ఆదేశిక సూత్రాలు – వర్గీకరణ

భారత రాజ్యాంగం ఆదేశిక సూత్రాలను వర్గీకరించలేదు. అధ్యయన సౌలభ్యం కోసం ఆదేశిక సూత్రాలను వాటి స్వభావం, తత్వాన్ని బట్టి రాజ్యాంగ నిపుణులు (ఎం.పి.శర్మ) 3 రకాలుగా పేర్కొన్నారు. అవి:

1) సామ్యవాద ఆదేశిక సూత్రాలు

2) గాంధేయవాద ఆదేశిక సూత్రాలు

3) ఉదారవాద ఆదేశిక సూత్రాలు

### సామ్యవాద ఆదేశిక సూత్రాలు

భారతదేశాన్ని సామ్యవాద దేశంగా రూపొందించాలనే నెహ్రూ అభిప్రాయాలకు అనుగుణంగా ప్రవేశపెట్టినవే సామ్యవాద ఆదేశిక సూత్రాలు.

**ఆర్టికల్ – 38:** ప్రకారం రాజ్యం ప్రజలందరికీ సామాజిక, ఆర్థిక, రాజకీయ న్యాయం లభించేలా కృషి చేయాలి.

**ఆర్టికల్ – 39:** దేశ సంపద కొద్దిమంది చేతిలో కేంద్రీకృతం కాకుండా చర్యలు తీసుకోవాలి. దేశంలోని సహజ వనరులు, సంపదను దేశ ప్రజల సమష్టి ప్రయోజనాల కోసం వినియోగించాలి. స్త్రీ, పురుషుల మధ్య వివక్ష తొలగించాలి. సమాన పనికి సమాన వేతనం కల్పించాలి.

**ఆర్టికల్ – 41:** ప్రభుత్వం దేశ ప్రజలకు తగిన జీవనోపాధిని కల్పించాలి. నిరుద్యోగులు, వృద్ధులు, వికలాంగులకు జీవనభృతి కల్పించాలి.

**ఆర్టికల్ – 42:** ప్రభుత్వం మాతా – శిశు సంక్షేమానికి అవసరమైన చర్యలు తీసుకోవాలి.

**ఆర్టికల్ – 43:** కార్మికులకు కనీస వేతనాలు, న్యాయమైన పని గంటలు, శ్రామికుల సంక్షేమానికి (ఆరోగ్యం, విద్య లాంటివి) చర్యలు తీసుకోవాలి. చిన్నతరహా కుటీర పరిశ్రమలు స్థాపించాలి.

**ఆర్టికల్ – 46:** రాజ్యం బలహీన వర్గాలకు ముఖ్యంగా ఎస్సీ, ఎస్టీ ప్రజల విద్యాభివృద్ధికి, ఆర్థికాభివృద్ధికి చర్యలు తీసుకోవాలి.

**ఆర్టికల్ – 47:** ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరచడానికి కృషి చేయాలి. ప్రజలకు ఆరోగ్యం, పౌష్టికాహారం లభ్యమయ్యేలా చర్యలు తీసుకోవాలి.

### గాంధేయవాద ఆదేశిక సూత్రాలు

గాంధీజీ కలలు, ఆశయాలు, సిద్ధాంతాలను సాకారం చేయడానికి ఆదేశిక సూత్రాల్లో కొన్ని అంశాలను చేర్చారు.

**ఆర్టికల్ – 40:** స్థానిక స్వపరిపాలన కోసం పంచాయతీరాజ్ వ్యవస్థను ఏర్పాటు చేయడం.

**ఆర్టికల్ – 43:** కుటీర పరిశ్రమలను స్థాపించడం, ప్రోత్సహించడం.

**ఆర్టికల్ – 46:** ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీ, బలహీన వర్గాల విద్య, సామాజిక అభివృద్ధికి చర్యలు తీసుకోవాలి.

**ఆర్టికల్ – 47:** ప్రజారోగ్యానికి భంగం కలిగించకుండా చర్యలు తీసుకోవాలి. మత్తుపదార్థాలు, మద్యపాన నిషేధానికి చర్యలు చేపట్టాలి.

**ఆర్టికల్ – 48:** వ్యవసాయాభివృద్ధికి ఆధునిక, శాస్త్రీయ పద్ధతులు ప్రవేశపెట్టాలి. పశుగణాభివృద్ధికి, గోవధ నిషేధానికి చర్యలు తీసుకోవాలి.

**ఆర్టికల్ – 49:** భారతదేశ ప్రాచీన సంస్కృతిని, జాతీయ ప్రాధాన్యమున్న చారిత్రక కట్టడాలను ప్రభుత్వం రక్షించాలి.

### ఉదారవాద ఆదేశిక సూత్రాలు

దేశంలో విద్యాభివృద్ధికి, న్యాయశాఖ స్వతంత్ర ప్రతిపత్తి, ప్రపంచ శాంతి కోసం కొన్ని ఉదారవాద సూత్రాలను చేర్చారు.

**ఆర్టికల్ – 44:** ప్రకారం, దేశ ప్రజలందరికీ వర్తించే ఒకే 'ఉమ్మడి పౌరస్మృతి'ని (Common civil code) రూపొందించాలి. ప్రస్తుతం భారతదేశంలో వివాహం, విడాకులు, వారసత్వానికి సంబంధించి హిందువులు, క్రిస్టియన్‌లు, ముస్లింలకు వేర్వేరు చట్టాలు ఉన్నాయి.

**ఆర్టికల్ – 45:** బాలబాలికలకు ఉచిత నిర్బంధ ప్రాథమిక విద్యను అందించాలి.

గమనిక: 2002లో 86వ రాజ్యాంగ సవరణ చట్టం ద్వారా దీన్ని 21 (A) అనే నూతన ఆర్టికల్ ద్వారా ప్రాథమిక హక్కుగా మార్చారు. దీని ప్రకారం 6 – 14 సంవత్సరాల మధ్య బాలబాలికలకు ఉచిత నిర్బంధ విద్య అందించాలి.

**ఆర్టికల్ – 50:** న్యాయవ్యవస్థకు స్వతంత్ర ప్రతిపత్తి కల్పించడానికి, కార్యనిర్వాహక శాఖ నుంచి న్యాయశాఖను వేరు చేయాలి.

**ఆర్టికల్ – 51:** ప్రపంచ శాంతి కోసం భారతదేశం కృషి చేయాలి.

### నూతన ఆదేశిక సూత్రాలు

1976లో 42వ రాజ్యాంగ సవరణ చట్టం ద్వారా కొన్ని నూతన ఆదేశిక సూత్రాలను చేర్చారు.

**ఆర్టికల్ 39 (A):** పేదలకు ఉచిత న్యాయం అందించాలి.

**ఆర్టికల్ 43 (A):** పరిశ్రమల నిర్వహణలో కార్మికులకు భాగస్వామ్యం కల్పించాలి.

**ఆర్టికల్ 48 (A):** పర్యావరణం, వన్యప్రాణుల రక్షణకు చర్యలు తీసుకోవాలి.

### నమూనా ప్రశ్నలు

**1.** ఆదేశిక సూత్రాలను భారత రాజ్యాంగంలో ఏ విభాగంలో పొందుపరిచారు?

1) 3వ భాగం 2) 4వ భాగం 3) 5వ భాగం 4) 6వ భాగం

**2.** భారత రాజ్యాంగంలో పొందుపరచిన ఆదేశిక సూత్రాల లక్ష్యం ఏమిటి?

1) శ్రేయో/ సంక్షేమరాజ్య స్థాపన 2) మతరాజ్య స్థాపన

3) ఆదర్శ రాజ్య స్థాపన 4) ఏదీకాదు

**3.** ఆదేశిక సూత్రాలను భారత రాజ్యాంగవేత్తలు ఏ రాజ్యాంగం నుంచి స్వీకరించారు?

1) స్విట్జర్లాండ్ 2) అమెరికా 3) బ్రిటన్ 4) ఐర్లాండ్

**4.** పంచాయతీరాజ్ వ్యవస్థ గురించి తెలియజేసే ఆర్టికల్ ఏది?

1) ఆర్టికల్ 40 2) ఆర్టికల్ 30 3) ఆర్టికల్ 50 4) ఆర్టికల్ 60

**5.** కార్యనిర్వాహక శాఖ నుంచి న్యాయశాఖను వేరు చేసే ఆర్టికల్ ఏది?

1) ఆర్టికల్ 40 2) ఆర్టికల్ 50 3) ఆర్టికల్ 45 4) ఆర్టికల్ 51

**6.** ఉమ్మడి పౌరస్మృతిని రూపొందించాలని సూచించే ఆర్టికల్ ఏది?

1) ఆర్టికల్ 44 2) ఆర్టికల్ 42 3) ఆర్టికల్ 43 4) ఆర్టికల్ 41

**7.** ఆదేశిక సూత్రాలను మరుసటి రోజు ఉల్లంఘించే నూతన సంవత్సర తీర్మానాలుగా విమర్శించింది ఎవరు?

1) కె.టి.షా 2) నసీరుద్దీన్ అహ్మద్ 3) అంబేద్కర్ 4) కె.సి.వేర్

**8.** 'ఒకవేళ ఈ ఆదేశిక సూత్రాలు అన్నీ అమలైతే భారతదేశం భూతలం మీద స్వర్గం అవుతుంది' అన్నది ఎవరు?

1) జవహర్‌లాల్ నెహ్రూ 2) గాంధీజీ 3) ఎం.సి.చాగ్లా 4) అంబేద్కర్

**జవాబులు**

1–2; 2–1; 3–4; 4–1; 5–2; 6–1; 7–2; 8–3.

**రచయిత: డాక్టర్ ఎం. సుధాకర్ రెడ్డి**

www.eenadupratibha.net
www.eenadupratibha.net

# ఇండియన్ పాలిటీ

## ఆదేశిక సూత్రాలు

**ప్రజల్లో సమానత్వాన్ని, సామాజిక న్యాయాన్ని పెంపొందించడానికి మన రాజ్యాంగంలోని ప్రాథమిక హక్కులు (3వ భాగం) రాజ్యానికి ఎక్కువ నకారాత్మక విధులను (Negative Functions) ఇచ్చాయి. సిద్ధాంతపరంగా మనుషులందరూ సమానులే, రాజ్యమిచ్చే స్వేచ్ఛకు అర్హులే. అయినప్పటికీ వారివారి సామాజిక, చారిత్రక నేపథ్యాల వల్ల చాలామంది ప్రజలు రాజ్యమిచ్చే స్వేచ్ఛను, అవకాశాలను అందుకోలేరు.**

రాజ్యం కల్పించే హక్కులు ఉన్నతవర్గాలకు మాత్రమే కాకుండా బలహీనవర్గాలు, చారిత్రకంగా, సామాజికంగా వెనుకబడినవారికి సకారాత్మకంగా (Positive) ఉపయోగపడాలనేదే శ్రేయో రాజ్య (Welfare State) ఉద్దేశం. ఆదేశిక సూత్రాలు శ్రేయో రాజ్య స్థాపనకు ఉపయోగపడతాయి. దీంతోపాటు గాంధీజీ ఆదర్శాలు, కొన్ని ఉదారవాద విధానాలు ఆదేశిక సూత్రాల్లో కనిపిస్తాయి. అయితే ఇప్పుడు చెప్పిన సకారాత్మక విధుల వల్ల (ఉదాహరణకు ఉద్యోగాల కల్పన, ప్రజల ఆరోగ్య సంరక్షణ మొదలైనవి) కొత్తగా స్వాతంత్ర్యం తెచ్చుకున్న భారతదేశంపై ఆర్థికభారం పడుతుందనే ఉద్దేశంతో వీటిని రాజ్యాంగంలోని IVవ భాగమైన ఆదేశిక సూత్రాల్లో చేర్చారు.

- IVవ భాగంలోని అంశాలకు న్యాయ సంరక్షణ లేదు. అంటే వీటి అమలు కోసం పౌరులు న్యాయస్థానాలను ఆశ్రయించలేరు. అయితే ఇవి సమాజంలో సకారాత్మక ఆర్థిక న్యాయాన్ని అందించేందుకు ఉద్దేశించినవి. శ్రేయో రాజ్యం ఏర్పడే దిశగా, సామాజిక న్యాయం సాధించే దిశగా రాజ్యాంగం కేంద్ర/ రాష్ట్ర ప్రభుత్వాలకు ఇస్తున్న సూచనలు, సలహాలే ఈ ఆదేశిక సూత్రాలు. వీటినే నిర్దేశిక నియమాలు అని కూడా అంటారు.
- రాజ్యాంగంలో 36 నుంచి 51వ అధికరణం వరకు ఈ ఆదేశిక సూత్రాలు ఉన్నాయి (మొత్తం 16 అధికరణాలు). వీటిని 1937 ఐరిష్ రాజ్యాంగం స్ఫూర్తితో మన రాజ్యాంగంలో పొందుపరిచారు. ఆదేశిక సూత్రాల అమలు కోసం పౌరులు న్యాయస్థానాలను ఆశ్రయించలేరు. కాబట్టి వీటిని అమలు చేయమని ఎవరూ ప్రభుత్వాలను ఒత్తిడి చేయలేరు. అయితే ఈ ఆదేశిక సూత్రాలు పాలనకు మూలస్తంభమని, రాజ్యం చట్టాలను రూపొందించే క్రమంలో వీటిని దృష్టిలో ఉంచుకోవాలని (37వ అధికరణం) రాజ్యాంగం చెబుతోంది.
- గ్రేన్‌విల్లి ఆస్టిన్ అనే రాజ్యాంగ నిపుణుడి అభిప్రాయం ప్రకారం ఆదేశిక సూత్రాలు ఈ దేశంలో సామాజిక విప్లవాన్ని ముందుకు తీసుకువెళ్లడానికి ఉద్దేశించినవి. రాజ్యానికి సకారాత్మక విధులు (ఆదేశిక సూత్రాల ద్వారా) ఇవ్వడం వల్ల వ్యక్తి స్వేచ్ఛకు, సామాజిక సంక్షేమానికి మధ్యే మార్గాన్ని రాజ్యాంగ నిర్మాతలు కనుక్కున్నారని ఆయన (ఆస్టిన్) వ్యాఖ్యానించారు.
- భారతదేశం ఒక సామాజిక, ఆర్థిక ప్రజాస్వామ్యంగా నిలదొక్కుకోవాలనేది ఆదేశిక సూత్రాల ప్రధాన లక్ష్యం.

### ఆదేశిక సూత్రాలు – రకాలు

ఆదేశిక సూత్రాలను స్థూలంగా మూడు రకాలుగా విభజించవచ్చు. అవి:

1) సామ్యవాద నియమాలు

2) గాంధేయవాద నియమాలు

3) ఉదారవాద / స్వేచ్ఛావాద నియమాలు

- పౌరులందరికీ జీవనోపాధి కల్పించడం, స్త్రీ – పురుషులకు సమాన వేతనాన్ని నిర్ణయించడం (39వ అధికరణం), నిరుద్యోగులు, వృద్ధులు, వికలాంగులకు జీవనభృతిని కల్పించడం (41వ అధికరణం) మొదలైనవి సామ్యవాద నియమాలు.
- గ్రామ పంచాయతీ వ్యవస్థలను నెలకొల్పడం (40వ అధికరణం), షెడ్యూల్డ్ కులాలు, జాతుల వారి సౌకర్యాల పట్ల రాజ్యం శ్రద్ధచూపడం (46వ అధికరణం), మత్తుమందుల బారి నుంచి ప్రజారోగ్యాన్ని రక్షించడం (47వ అధికరణం); గోవులు, ఇతర పెంపుడు జంతువుల వధను నిషేధించడం (48వ అధికరణం) లాంటివి గాంధీజీ ఆశయాలు. కాబట్టి వీటిని గాంధేయవాద నియమాలుగా పేర్కొనవచ్చు.
- ఉమ్మడి పౌరస్మృతి (44వ అధికరణం), న్యాయశాఖను కార్యనిర్వాహక శాఖ నుంచి వేరు చేయడం (49వ అధికరణం) మొదలైనవి ఉదారవాద సూత్రాలుగా పేర్కొనవచ్చు.

- ఆదేశిక సూత్రాలు భారత ప్రభుత్వ చట్టం 1935లో పొందుపరిచిన ఇన్‌స్ట్రుమెంట్ ఆఫ్ ఇన్‌స్ట్రక్షన్స్ (Instrument of Instructions) ను పోలి ఉంటాయి.
- ఐవర్ జెన్నింగ్స్ 'సామ్యవాద అంశాలు లేని కాల్పనిక సామ్యవాద సూత్రాలు'గా ఆదేశిక సూత్రాలను విమర్శించారు. జాతీయాకరణ అనే పదజాల ప్రయోగం జరగలేదు. కానీ సామ్యవాద భావజాలం వీటిలో (ఆదేశిక సూత్రాల్లో) కనిపిస్తుందనేది ఐవర్ జెన్నింగ్స్ అభిప్రాయం. అయితే జెన్నింగ్స్ విమర్శను డి.డి. బసు ఖండించారు.
- బసు అభిప్రాయం ప్రకారం భారత రాజ్యాంగ నిర్మాతలు ఏ ఒక్క రాజకీయ భావజాలానికీ అతిగా ప్రభావితులై వ్యవహరించలేదు. ఇటు పెట్టుబడిదారీ వ్యవస్థ వైపు లేదా అటు సామ్యవాదం పేరుతో అప్పటి USSR (ఇప్పటి రష్యా)లో ఉన్న రాజ్య నియంతృత్వ పోకడల పట్ల మొగ్గు చూపకుండా భారతదేశాన్ని ఒక శ్రేయోరాజ్యంగా నిర్మించేందుకు నెహ్రూ కృషి చేశారు.
- 1955లో ఆవడిలో జరిగిన కాంగ్రెస్ సమావేశంలో సోషలిస్టిక్ పాటర్న్ ఆఫ్ సొసైటీ (సామ్యవాద తరహా సమాజ స్థాపన) ప్రణాళిక లక్ష్యమని చెప్పారే తప్ప, ఏ ఒక్క భావజాలం వైపు నెహ్రూ అతిగా మొగ్గు చూపినట్లు మనకు కనిపించదు. అయితే ఇందిరాగాంధీ కాలంలో చేసిన 42వ రాజ్యాంగ సవరణ ద్వారా రాజ్యాంగ ప్రవేశికలో 'సామ్యవాదం' అనే పదజాలాన్ని చేర్చారు.
- ప్రొఫెసర్ కె.సి.వేర్ ఆదేశిక సూత్రాలపై ఘాటైన విమర్శ చేశారు. ఆదేశిక సూత్రాల వల్ల రాజ్యాంగం, న్యాయస్థానాలు, శాసనసభ మూడూ సంఘర్షణలో పడతాయని ఆయన హెచ్చరించారు. తర్వాతి కాలంలో అవి కొంతవరకు నిజమయ్యాయని రాజ్యాంగం పనితీరును పరిశీలిస్తే తెలుస్తుంది.
- ఆదేశిక సూత్రాలను రాజ్యాంగంలో చేర్చడం ద్వారా మన రాజ్యాంగ నిర్మాతలు రాజ్య దీర్ఘకాలిక లక్ష్యాలను (సామాజిక సంక్షేమం), పేదరిక నిర్మూలన, ఉద్యోగ కల్పన లాంటి అంశాలను అందులో చేర్చినట్లయ్యింది. వీటిని అమలుపరచని పక్షంలో పౌరులు న్యాయ స్థానాలను ఆశ్రయించలేరు. కానీ, డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ పేర్కొన్నట్లు ఆదేశిక సూత్రాలను కేంద్ర/ రాష్ట్ర ప్రభుత్వాలు విస్మరిస్తే ఎన్నికల సమయంలో తమకు ఓటు వేసినవారికి జవాబు చెప్పాల్సి ఉంటుంది.

## అధికరణాలు

### 36వ అధికరణం

ప్రాథమిక హక్కుల్లో 12వ అధికరణం రాజ్యాన్ని ఎలా నిర్వచిస్తుందో 36వ అధికరణం కూడా రాజ్యాన్ని అదేవిధంగా నిర్వచిస్తోంది.

### 37వ అధికరణం

ఆదేశిక సూత్రాలను అమలు చేయాల్సిందిగా ఏ న్యాయస్థానం ఉత్తర్వులను జారీ చేయకూడదు. అయితే చట్టాలను రూపొందించేటప్పుడు ప్రభుత్వాలు వీటిని తప్పకుండా పరిగణనలోకి తీసుకోవాలి.

- సుప్రీంకోర్టు చంపకం దొరై రాజన్ కేసు (1951)లో, ఆ తర్వాత కేరళ విద్యా బిల్లు (1958)లో ఆదేశిక సూత్రాలకు న్యాయ సంరక్షణ లేదని స్పష్టం చేసింది. 1970 తర్వాత సుప్రీంకోర్టు తన ఉద్దేశాలను మార్చుకున్నట్లు కనిపిస్తుంది.

### 38వ అధికరణం

- జాతీయ జీవనంలో అందరికీ ఆర్థిక, సామాజిక, రాజకీయ న్యాయం అందించడానికి తగిన సామాజిక వ్యవస్థను నెలకొల్పేందుకు, తద్వారా ప్రజా సంక్షేమానికి అనువైన వాతావరణాన్ని కల్పించేందుకు ప్రభుత్వం తప్పనిసరిగా కృషి చేయాలి.
- రాజ్యం ఆర్థిక అసమానతలను సాధ్యమైనంత తగ్గించడానికి కృషి చేయాలి. ప్రజల మధ్య హోదా, సౌకర్యాలు, అవకాశాల్లో వ్యత్యాసాలను తొలగించేందుకు ప్రయత్నించాలి. విభిన్న ప్రాంతాల్లో లేదా విభిన్న వృత్తుల్లో ఉన్న ప్రజల మధ్య సౌకర్యాలు, అవకాశాల్లో ఉన్న తారతమ్యాలను తొలగించేందుకు కృషి చేయాలి. (38వ అధికరణంలోని 2వ క్లాజ్‌ను 1979లో జరిగిన 44వ రాజ్యాంగ సవరణ ద్వారా చేర్చారు.)

### 39వ అధికరణం

ప్రభుత్వం విధాన రూపకల్పనలో కింది ఆదేశిక సూత్రాలను దృష్టిలో ఉంచుకోవాలి.

- తగిన జీవనాధారాన్ని ఎంపిక చేసుకోవడంలో స్త్రీ, పురుషులకు సమాన హక్కులు ఉండాలి.

- ✪ సామాజిక శ్రేయస్సును దృష్టిలో ఉంచుకుని అందుబాటులో ఉన్న సహజ వనరులపై యాజమాన్య నియంత్రణ కలిగి ఉండాలి, సమాజంలో అందరికీ వాటిని సమానంగా పంపిణీ చేయాలి.
- ✪ ఉత్పత్తి పరికరాలు, సంపద కేవలం కొద్దిమంది చేతుల్లో కేంద్రీకృతం కాకుండా ఆర్థిక విధాన రూపకల్పన.
- ✪ స్త్రీ, పురుషులందరికీ సమానమైన ఉద్యోగాల్లో సమానమైన వేతన సిద్ధాంతాన్ని అమలు చేయడం.
- ✪ స్త్రీ, పురుష కార్మికుల శ్రమశక్తి, ఆరోగ్యం, బాల్యావస్థలో ఉన్న బాల కార్మికుల ఆరోగ్యం, శ్రమశక్తి దోపిడీకి గురికాకుండా, ఆర్థిక పరిస్థితుల వల్ల విధి లేని పరిస్థితుల్లో వారు తమ వయసు, శక్తికి మించిన పనులు చేయడాన్ని నివారించడం.
- ✪ స్వేచ్ఛాయుత, గౌరవప్రదమైన పరిస్థితుల్లో, ఆరోగ్యకరమైన పద్ధతిలో పిల్లల అభివృద్ధికి తగిన అవకాశాలు, సౌకర్యాలను కల్పించడం. బాల్యం, యవ్వనం దోపిడీకి గురికాకుండా చూడటం. (1976లో 42వ రాజ్యాంగ సవరణ ద్వారా 39 (F) ను చేర్చారు.)

## మాదిరి ప్రశ్నలు

**1.** ఆదేశిక సూత్రాలను ఏ దేశ రాజ్యాంగం నుంచి గ్రహించారు?

ఎ) అమెరికా రాజ్యాంగం బి) ఇంగ్లండ్ రాజ్యాంగం
సి) ఐర్లాండ్ రాజ్యాంగం డి) స్విట్జర్లాండ్ రాజ్యాంగం

**2.** ఆదేశిక సూత్రాలను రాజ్యాంగంలోని ఏ భాగంలో పొందుపరిచారు?

ఎ) IIIవ భాగం బి) IVవ భాగం సి) Vవ భాగం డి) VIవ భాగం

**3.** ఆదేశిక సూత్రాలకు న్యాయ సంరక్షణ లభించదని ఏ అధికరణం తెలియజేస్తోంది?

ఎ) 37వ అధికరణం బి) 32వ అధికరణం సి) 39వ అధికరణం డి) 42వ అధికరణం

**4.** 'ఇన్‌స్ట్రుమెంట్ ఆఫ్ ఇన్‌స్ట్రక్షన్స్' ఏ చట్టంలోనిది?

ఎ) 1909 చట్టం బి) 1919 చట్టం సి) 1935 చట్టం డి) 1947 చట్టం

**5.** 'సోషలిస్టిక్ పాటర్న్ ఆఫ్ సొసైటీ' (సామ్యవాద తరహా సమాజం) ప్రణాళిక లక్ష్యమని నెహ్రూ ఏ కాంగ్రెస్ సభలో పేర్కొన్నారు?

ఎ) ఆవడి బి) బొంబే సి) భువనేశ్వర్ డి) సూరత్

**6.** గ్రామ పంచాయతీ వ్యవస్థకు సంబంధించిన ప్రస్తావన ఏ అధికరణంలో ఉంది?

ఎ) 40వ బి) 42వ సి) 44వ డి) 38వ

**7.** 'ఆదేశిక సూత్రాలను సామ్యవాద అంశాలు లేని కాల్పనిక సామ్యవాదం' అని ఎవరు పేర్కొన్నారు?

ఎ) డి.డి.బసు బి) జవహర్‌లాల్ నెహ్రూ
సి) అంబేద్కర్ డి) ఐవర్ జెన్నింగ్స్

**8.** ఆదేశిక సూత్రాలను పరిశీలిస్తే భారతదేశం ఎలాంటి దేశంగా అవతరించాలని రాజ్యాంగం అభిలషించింది?

ఎ) అరాచక రాజ్యం బి) స్వేచ్ఛా రాజ్యం సి) శ్రేయోరాజ్యం డి) ఏదీకాదు

**9.** ఉమ్మడి పౌరస్మృతి గురించి పేర్కొంటున్న అధికరణం ఏది?

ఎ) 41వ బి) 44వ సి) 40వ డి) 38వ

**10.** భారతదేశంలో సామాజిక విప్లవాన్ని ముందుకు తీసుకెళ్లడానికి ఆదేశిక సూత్రాలు ఉపయోగకరమని భావించింది ఎవరు?

ఎ) ఐవర్ జెన్నింగ్స్ బి) బి.ఎన్.రావు
సి) గ్రేన్‌విల్లి ఆస్టిన్ డి) బాబూ రాజేంద్రప్రసాద్

**11.** 'ఆదేశిక సూత్రాలను ప్రభుత్వాలు విస్మరిస్తే ఎన్నికల సమయంలో తమకు ఓటు వేసినవారికి జవాబు చెప్పాల్సి ఉంటుంది' అని పేర్కొన్నది ఎవరు?

ఎ) కె.సి.వేర్ బి) ఆస్టిన్ సి) అంబేడ్కర్ డి) కె.ఎం.మున్షీ

**12.** ఆదేశిక సూత్రాలకు న్యాయ సంరక్షణ లేదని సుప్రీం కోర్టు ఏ కేసులో పేర్కొంది? ?

ఎ) చంపకం దొరై రాజన్ కేసు బి) మినర్వా మిల్స్ కేసు

సి) సజ్జన్‌సింగ్ కేసు డి) జబల్‌పూర్ కేసు

**13.** 38(2) ను ఏ రాజ్యాంగ సవరణ ద్వారా రాజ్యాంగంలో చేర్చారు?

ఎ) 44వ బి) 24వ సి) 42వ డి) 25వ

**14.** 'మత్తుమందుల బారి నుంచి ప్రజారోగ్యాన్ని కాపాడటం రాజ్యవిధి' అని తెలిపే అధికరణం ఏది?

ఎ) 44వ బి) 40వ సి) 47వ డి) 38వ

**15.** 'గోవధను నిషేధించాలి' అనేది ఏ విధమైన ఆదేశిక సూత్రంగా పేర్కొనవచ్చు?

ఎ) సామ్యవాద నియమం బి) గాంధేయవాద నియమం

సి) ఉదారవాద నియమం డి) ఏదీకాదు

## జవాబులు

1-సి; 2-బి; 3-ఎ; 4-సి; 5-ఎ; 6-ఎ; 7-డి; 8-సి; 9-బి; 10-సి; 11-సి; 12-ఎ; 13-ఎ; 14-సి; 15-బి.

**రచయిత: జి. కళ్యాణ చక్రవర్తి**